# ఊసరవెల్లి

వయస్సు పెరిగిన కొద్దీ బుద్ధి విశాలమవుతుందనీ, అవగాహన శక్తి పెరుగుతుందనీ అంటారు. ఇది నిజమే గానీ, అందరి విషయంలోనూ కాదనుకొంటాను. నా మటుకు నాకు ఈ నాటికీ అర్థం గాని విషయాలు అనేకమున్నాయి. ఆ మాట కొస్తే ఎవరికి లేవుగనకా! కొందరి విషయంలో, ఒక దశ కొచ్చాక పెరుగుదు ఆగిపోతుంది. అలాంటి గిడసబారిన వారితో వేగడం చాలా కష్టం. కర్మకాలి వాళ్ళే సాహితీపరులయితే- ఇంకేమిటి చెప్పడం! వారికి ముద్దున్నది అభివృద్ధి నిరోధక సాహిత్యం! వారి తరువాత వచ్చింది పిదప సాహిత్యం!

ఇంతగా ఎందుకు చెబుతున్నానంటే, ముకుందంగారి ధోరణి నా కింతవరకూ అంతుబట్టలేదు. ఎప్పటికప్పుడు నాకు

నేనే సమాధానం చెప్పుకొంటూ వస్తున్నాను. మహా కవుల రచనలు బ్రహ్మపదార్థం లాంటివనీ, వాటిని అర్థం చేసుకోవటం- సామాన్యులకు- అంటే మరీ నా లాంటివాడికి- కష్టసాధ్యమనీ అంటుంటారు. ఈ మాటలు జ్ఞాపకానికి తెచ్చుకొంటూ, పదేపదే ప్రశ్నించే వెధవ మనస్సును జోకొడుతూ వస్తున్నాను. అయినా ఒక్కొక్కసారి అది నిద్రపోకుండా ఎదురు తిరిగి రెచ్చిపోతూ ఉండేది!

ముకుందంగారికీ, నాకూ ఎలా పరిచయ మేర్పడిందో నా కిప్పుడు జ్ఞాపకం లేదు. బహుశా ఆ పరిచయం సాహిత్యపరంగానే జరిగి ఉంటుంది. మా పరిచయం అభివృద్ధి కావడానికట్టే కాలం పట్టలేదు. మొదటి రోజుల్లో, అప్పుడప్పుడు దగ్గర దగ్గరకు పోతూ ఉండేవాణ్ని! వారు కూడా చాలా ఆప్యాయంగా కబుర్లు చెబుతూ ఉండేవారు. రాను రాను వారింటికి వెళ్ళడం ఓ దినచర్యగా పరిణమించింది. వారు కూడా నా కోసం ఎదురు చూస్తున్నట్టే మాట్లాడేవారు. ఆయనగారికి కబుర్లు చెప్పడం చాలా ఇష్టమనీ- అసలు అంతకన్నా వారు చెయ్యవలసింది ఏమీ లేదనీ తెలిసినప్పుడు నేను బ్రహ్మానందపడ్డాను.

సాధారణంగా మా సంభాషణ ఇలా మొదలయ్యేది-

"చూశావుటోయ్ రావుజీ ?"

"ఏమిటి మేస్టారూ ?" అనేవాణ్ణి నేను చుట్టూ ఓ సారి కలయచూసి.

"ఈ పూట...." అని ఓ క్షణం ఆగి, కళ్ళు టపటప లాడించేవారు ముకుందంగారు.

"ఏం జరిగింది మేష్టారూ ?"

"కాఫీ యోయ్ !"

"బావో లేదాండి ?"

"హోరి నీ ఇంట మానుగురవా! బ్రహ్మాండంగా ఉందోయ్ ! కాఫీ తాగడమే జరిగితే, రావుజీ- మా యింట్లోనే తాగాలి. లేదా జఫేటాపూర్ మహారాణిగారి సువారంలో తాగాలి. అంతేగానీ...."

"జఫేటాపూర్ మహారాణి మీకు తెలుసా మేష్టారూ?" అని ఆశ్చర్యం నటించేవాణ్ణి.

"మెల్లిగా అంటావేమిటోయ్ రావుజీ! ఏకంగా పదేళ్ళపాటు తెలుసు. నేను రాసిన "కలలో కలిసిన కాంత" అన్న కావ్యఖండిక జఫేటాపూర్‌లోనే రాశాను" అని ఆలోచించుకోవడానికి నాకు కొంత వ్యవధి నిచ్చేవారు.

ఆ వ్యవధిలో నే నిలా ఆలోచించేవాణ్ని- ముకుందం గారు సామాన్యులు కారు. ఆయన ఇంతవరకూ అందరికీ తెలిసిన- అరపావు పుస్తకాలే గాక, 'కలలో కలిసిన కాంత' అనే కావ్యఖండిక గూడా రాశారు. కారణాంతరాల వల్లనో, అనివార్య కారణాల వల్లనో ఇంతవరకు అది వెలుగు ముఖం చూడలేదు-

నే నీ రకంగా ఆలోచించినట్టు వారి కెలా తెలిసేదో

గానీ, నా ఆలోచన కాగానే, వారు మళ్ళీ కబుర్లు మొదలెట్టేవారు.

"జఫేటాపూర్ మహారాణి– రాణీ రుద్రమాంబా కనకవల్లీ వేంకట సుభద్రాయమ్మారావుగారు గొప్ప అందగత్తె; అలాంటి అందం నువ్వెక్కడా చూసి ఉండవు. కనీసం ఊహించి గూడా ఉండవు. రాజావారికి సుభద్రాయమ్మగారంటే పంచప్రాణాలు. వారికి నేనన్నా, నా సాహిత్యమన్నా పంచప్రాణాలు. గంటల గ్గంటలు– రోజులకు రోజులు గూడానేమో– వారితో అలా సాహిత్య చర్చలు జరుపుతూ ఉండేవాణ్ని. 'తుస్' అన్న పదంమీద– ఒకసారి వారం రోజులపాటు హోరాహోరిగా చర్చలు జరిగాయి" అనేవారు ముకుందంగారు.

"నా కర్థం కాలేదు మేస్టారూ ! వారం రోజులపాటు చర్చించవలసింది ఏమున్నదంటారు అందులో ?" అనేవాణ్ని.

ముకుందంగారు ఓ చిరునవ్వు నవ్వేవారు. 'చిరు' అని నేను చేర్చాను గానీ, నిజానికా నవ్వు చాలా 'ముదురు' గానే ఉండేది.

"ఓరి పిచ్చివాడా !', అని ఫక్కుమనేవారు ముకుందంగారు. 'తుస్' కరెక్టా ? లేక 'తస్' కరెక్టా అన్నది మా చర్చకు మూలం. 'తుస్' అన్న శబ్దం ఉన్నదని నేను అనేక గ్రంథాల నుండి ప్రయోగాలు చూపించేవాణ్ని. కానీ రాణీ సాహెబావారు మాత్రం వొప్పుకొనేవారు కారు. అసలు

పదం 'తస్' అంటారు వారు. ఈ పదమే కాలక్రమేణా ప్రజల వాడుకలో పడి 'తుస్' గా మారిందనేవారు. ఇందు కోసం వారు, ఎన్నో శిలాశాసనాల నుండీ, తామ్రశాసనాల నుండీ, ఈ పదాన్ని ఎత్తి చూపించేవారు".

"ఇన్నిటికీ పది కరెక్టు మేస్టారూ ?" అడిగేవాణ్ని నేను అయోమయంగా.

ముకుందంగారో నవ్వు నవ్వేవారు. అదే దానికి సమాధానం. అయితే ఆ నవ్వుకు 'ఔన' నీ 'కాద' నీ కూడా అర్థాలు చెప్పుకోవచ్చును. సమయానుకూలంగానూ, నా ఇష్ట ప్రకారంగానూ నేను అర్థం చెప్పుకొంటూ వుండేవాణ్ని.

ఈ విధంగా ముకుందంగారు తమ లీలా వినోదాలను నాకు తెలియపరుస్తూ ఉండేవారు. నేను కూడా ఆసక్తితో వింటూ, జన్మను తరింపచేసుకొంటూ ఉండేవాణ్ని. శ్రీవారి పరిచయమే లేకపోతే నా కీ అమూల్యాంశాలు తెలిసే మార్గమే ఉండేది కాదుగదా !

ముకుందంగారికి చాలామంది పెద్దలతో సన్నిహిత సంబంధా లున్నాయని తెలియడమే కాదు- వారి దర్శన భాగ్యం కూడా నాకు లభించేది. గొప్ప గొప్ప సాహితీ వేత్తలు వారింటి కొచ్చేవారు; రాజకీయ నాయకులు రావడం కూడా నాకు తెలుసు. చిత్ర మేమిటంటే, సాహితీవేత్తలతో రాజకీయాలు మాట్లాడితే, రాజకీయ నాయకులతో సాహిత్యాన్ని గురించి ముచ్చటించేవారు. ఇందులో ఏ వొక్కరికీ,

రెండపదాన్ని గురించి అంతగా తెలియదనీ, అందువల్లనే 'మేస్టారు' ఇలా అంటుండేవారనీ, పాపిష్టి మనస్సుకు అప్పు డప్పుడు అనిపించేది గానీ, దాన్ని నేను ఎంతమాత్రం ఖాతరు చేసేవాణ్ని కాదు. నా మనస్సుకు- అప్పుడప్పుడే ననుకోండి- ఇలాంటి ఆలోచన లొస్తుంటాయని వారికి తెలిసేదిగావును- నా సందేహాలను పటాపంచలు చేస్తూ ఉండేవారు ముకుందం గారు.

"రావుజీ ! సాహిత్యాన్నీ, రాజకీయాలనూ విడదీయ టం కూడదు. అసలు సాధ్యం కాదనే నేనంటాను. దేహాన్నీ, జీవుణ్నీ వేరుచెయ్యడం సాధ్యమేనా ?" అని అడిగేవారు.

'సాధ్యం కా' దన్న ధ్వని ప్రశ్నలోనే ఉంది గనుక నేను కూడా 'కాదు' అనేసేవాణ్ని.

"అదే విధంగా ఇదికూడాననుకో ! అనాది సాహిత్యం వేదాలుగదా ! అందులోని రుక్కులన్నీ ఏమిటంటావ్ ? ఇంద్రుణ్నీ, వరుణుణ్నీ, అగ్నిదేవుణ్నీ, వాయుదేవుణ్నీ ప్రార్థించటం ! అంటే- ఆనాడు అధికారంలో ఉన్నవారిని స్తుతించడమన్నమాట ! తద్వారా వారి ప్రాపకాన్ని సంపా దించి పనులు నెరవేర్చుకోవడమన్న మాట. ఇది రాజకీయం కాకుండాపోదేమరి ! అంతదాకా అవసరం లేదు- పంచమ వేదంగా భావిస్తున్న భారతమున్నదనుకో ! ఆంధ్ర సాహి త్యంలో దానికున్న విలువ మరిదేనికీ లేదన్న సంగతి మనంద రికీ తెలుసు. అయినా అందులో ఉన్నవన్నీ రాజకీయాలే !

ధృతరాష్ట్రుడు, అర్ధరాజ్యం పాండవుల కిచ్చినట్లయితే, భారతమే ఉండేది కాదు. కాబట్టే రాజకీయాలనూ, సాహిత్యాన్నీ విడదీయటం అసాధ్యమని నే ననడం" అనేవారు ముకుందం గారు.

నాకూ నిజమనిపించేది. 'ఓహో వీరి దృక్పథం ఇదన్న మాట' అని సరిపెట్టుకొనేవాణ్ని. దాని మంచిచెడ్డలను గురించి నేనల్టే తర్కించేవాణ్ని కాదు. ఎవరి దృక్పథం వారిదీ, ఎవరి ఇష్టాలు వారివీనూ ! కాదనడానికి మధ్యలో నే నెవణ్ని గనకా ?

కానీ ఇదికూడా వారి దృక్పథం కాదని తెలిసినప్పుడు తప్పకుండా ఆశ్చర్యం వేసేది. ఓ సారి ఓ సాహిత్య వస్తాదుతో ముకుందంగారు చర్చిస్తున్నప్పుడు నా కీ విషయం తెలిసింది.

"ప్రతి దాంట్లోనూ ఈ రాజకీయాలు జొరబడి మురికి చేస్తున్నాయి. మొన్నమొన్నటి వరకూ సాహిత్యం దీనికి దూరదూరంగా ఉండేది. ఇప్పుడదీ లొంగిపోతూ ఉంది. కా గుణింతం రాని రాజకీయ నాయకులు, మహా కావ్యాలు అంకితం పుచ్చుకొంటున్నారు. ఏ సాహిత్య సభ చూడండి, ఓ డిప్యూటీ మంత్రయినా లేకుండా జరగడం లేదు. అధమం శాసన సభ్యుణ్నయినా పట్టుకొని కూచోబెడుతున్నారు. ఆయనగారికి సాహిత్యమూ తెలీదు, సభలూ తెలీవు. కానీ అనర్గళంగా అరగంటసేపు అభిభాషించి వెళ్ళిపోతాడు. ఈ కవులు కూడా అంతమాత్రంవాళ్ళే ! ఈ రాజకీయ నాయ

కులు రాందే సభ జరపరు. ఈ విధంగా మరికొంత కాలం గడిస్తే కవితాకన్య గతేమిటంటారు అన్నగారూ ?"

ఈ దెబ్బతో పూర్వం నాకుండుకున్నటువంటి అభిప్రాయాలు పోయేవి. మళ్ళా కొత్తవాటిని- అంటే తాజా సరుకును- నింపుకొనేవాణ్ని. రాజకీయాలకు సాహిత్యం దూరంగా ఉండటమే ముకుందంగారి తాజా అభిప్రాయమని విశ్వసించేవాణ్ని ! ఖర్మమేమిటంటే, ఇదయినా పది కాలాల పాటు దక్కే రాత నాకుండేదికాదు. ఏ రాజకీయ నాయకునితోనన్నా మాట్లాడుతున్నప్పుడు ముకుందంగారి దృక్పథం ఇంకోలా ఉండేది.

"అయ్యా ! మీరు వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి ! ఒక్క విషయం మాత్రం మనం విస్మరించగూడదు. అదేమిటంటే, సమాజం. సమాజంలో, ఒకే కాలంలో అటు రాజకీయవాదీ, ఇటు కవీ బ్రతుకుతున్నారు. అంటే ఒకరి ప్రభావం మరొకరిమీద పడక తప్పదు. సమాజాన్ని అభ్యుదయ మార్గంలో నడిపేది రాజకీయవాదే ? 'విశ్వ శ్రేయః కావ్యం' అన్నారు పెద్దలు. అంటే విశ్వం మొత్తానికి శ్రేయస్సు కలిగించేదే కావ్యమనిగదా అర్థం ! ఆ పని చేయవలసింది రాజకీయ నాయకులు. అంటే వారే కావ్యకర్తలన్నమాట. అంటే వారే కవులన్నమాట. ఈ మహత్తర లక్ష్యాన్ని సాధించడానికి సాహిత్యం ఒక సాధనమన్న మాటే ! రాజరాజ నరేంద్రుడంతటివాడు, తన కాలంలో ఉండే బౌద్ధ, జైన

మతోద్ధృతాలను అణిచి, దేశంలోని అరాచకాన్ని సర్దటానికి నన్నయచేత భారతాన్ని ఆంధ్రీకరింప చేశాడు. అంటే ఏమి టన్న మాట- దేశపు శాంతి భద్రతల నిమిత్తం- సాహి త్యాన్ని ఆయుధంగా ఉపయోగించాడన్నమాట. కాబట్టే-"

మళ్ళీ నేను నా అభిప్రాయాలను సరిదిద్దుకొనేవాణ్ని. రాను రాను నే నింకో పద్ధతి కూడా అవలంబించసాగాను. అదేమిటంటే, సరిదిద్దుకోవటానికి వీలుగా ఉండే అభిప్రాయా లను ఏర్పాటు చేసుకోవడం!

ఆధునిక సాహిత్యంమీదా, పూర్వ సాహిత్యంమీద కూడా ముకుందంగారి అభిప్రాయాలు చాలా చిత్రంగా ఉండేవి. మాటవరసకు పూర్వ సాహిత్యం చాలా మంచిదన్నా రనుకోండి, వెంటనే వారిలా అనేవారు.

"మంచిదేకాదు నాయనా! అది మేలిమి బంగారం లాంటిది. అనేక ఢక్కా-మొక్కీలకు తట్టుకొని నిలబడిందది. అసలింత కాలమూ అది నిలబడిందంటేనే దాని విశిష్టత ఎలాంటిదో మనకు తెలిసిపోతూ ఉంది. నిన్న అచ్చువేసిన పుస్తకం ఈనాడు చచ్చి వూరుకొంటోంది. బాణుని కాదంబరి తీసుకోండి. ఆ కల్పనా చాతుర్యం చూసి ముగ్ధులమవుతాం. కాళిదాసు శాకుంతలం ఉంది. మేఘ సందేశముంది. భాసుని నాటకా లున్నాయి. ముఖ్యంగా 'మధ్యమ వ్యాయోగం' తీసుకోండి. అందులో ఉన్న ఒక్క పంక్తికి సరిపోతాయంటారా మన రాతలన్నీ కలిసి? చాలదు నాయనా చాలదు. తెలుగు

కావ్యాలు చూడండి. ఆముక్తమాల్యద, వసుచరిత్ర, పాండురంగ మహాత్మ్యం, విజయవిలాసం, నైషధం, భీమఖండం, పారిజాతాపహరణం– ఎక్కడండీ అలాంటి గ్రంథాలు! అవి చదవలేం! చదివినా అర్థం చేసుకోలేం! అర్థం చేసుకొన్నా ఆనందించలేం! మనం అరంగుళం మనుషులం. మన బ్రతుకు రెండంగుళాల వృత్తంలో ఇమిడిపోయింది. మనం కొత్తగా రాయగలిగింది గానీ, రాస్తున్నది గానీ ఏమీ లేదు. అంతా పూర్వులే రాశారు" అన్నారు ముకుందంగారు.

ఆధునిక సాహిత్యాన్ని గురించి మాట్లాడమన్నామనుకోండి. దానిమీద కూడా వారు అనర్గళంగానే మాట్లాడేవారు. ఆధునిక సాహిత్యపు వన్నెచిన్నెలను కళ్ళకు కట్టినట్టు చెప్పేవారు.

"ఆధునిక సాహిత్యం అర్థం లేదంటున్నవారికి, ఆధునిక జీవితంతో సంబంధం లేదనుకొనాలి మనం. కళ్ళు ముచ్చిలిగుంటలో ఉన్నవారికి ఈ నాటి సాహిత్యం రుచించని మాట నిజం! ఎందుకంటే– వారు జీవితాన్నుండి దూరంగా ఉన్నారు గనుక, సాహిత్యం అత్యున్నత స్థాయిలో ఉండటమన్నదే నిజమయితే, అదిప్పుడే జరిగిందనుకోవాలి. పూర్వ సాహిత్యానికి ప్రజలతో నిమిత్తం లేదు. అది రాచరికాలను నిలబెట్టడం కోసం ప్రయత్నించింది. మదాంధులైన రాజులు అందులో నాయకులు, కామంతో కణకణ మండే వన్నెకత్తెలు నాయికలు. వారి విరహంతో కావ్యం నిండిపోయేది.

"అయితే కొందరు- అవి ఇంతకాలం నిలబడటానికి టానికి కారణమేమిటని అడగొచ్చు. వారిని నేనో ప్రశ్న అడుగుతున్నాను. నల్లమల కొండలు ఎప్పటినుండో ఉన్నాయి. అంతమాత్రాన అవి గొప్పవంటామా? చిరకాలం ఉండట మన్నది కావ్యం గొప్పతనమే అయితే, నల్లమల కొండలూ, కావ్యాలు కావాలి. ఆ మాట మీ రొప్పుకొంటారా? ఈనాటి కవికి ప్రజలే నాయకులు. వారి బాధలే నాయికలు. ఆధునిక సాహిత్యంలో అర్థం కాని భాగాలున్నాయన్నా, నిరాశ, నిస్పృహ, దుఃఖం, చిరాకు, కనిపిస్తున్నాయన్నా, అవన్నీ ఈ నాటి సమాజంలోనే ఉన్నాయని గ్రహించవలసి ఉంది. తన పని తాను అరగంటలో ముగించిన పద్యం- భారతం కన్నా గొప్పదంటాను. ఈ పద్యం బ్రతుకు అరగంటే అవు గాక- అయినా తన ప్రయోజనాన్ని దిగ్విజయంగా సాధించింది. ఏనాడైనా సాహిత్యం చెయ్యవలసింది ఇంతకన్నా లేదేమో? అన్నీ పూర్వులే రాశారనడం నా కిప్పటికీ అర్థం కాకుండా ఉంది. ఈ నాటి నవల, కథానిక, నాటిక, వచన పద్యం, గేయం, పూర్వ సాహిత్యంలోనే ఉన్నాయన్న మాటలు విన్నప్పుడల్లా- వారిని చూసి జాలిపడటంకన్నా నేనేమీ చెయ్యలేను. అందరికీ రాసే హక్కు కూడా ఉంది. సాహిత్యారాధన, ఏ కొందరి సొత్తో కాదు. అది జాతీయ సంపద. ఆధునిక సాహిత్యవేత్తలు విరివిగా కృషి చేసి ఈ సంపదను దినదినాభివృద్ధి చెయ్యవలసిన అవసరం ఎంతైనా

ఉంది" అనేవారు ముకుందంగారు.

ఇదే కాదు— ఏ విషయం కానీయండి— ముకుందంగారు అనర్గళంగా మాట్లాడేస్తారు. తన అభిప్రాయాలేమిటో చెబుతారు. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే— ఇందులో వారి అసలు అభిప్రాయా లేమిటో ఎవ్వరికీ తెలియకపోవటం.

మనిషన్న తరవాత, మంచివో, చెడ్డవో వాడివనిపించుకొనే ఉద్దేశాలు కొన్ని ఉంటాయి. ఇన్నేళ్ళ గాఢ స్నేహం తరువాత కూడా 'ముకుందంగారి వనిపించుకొనే ఉద్దేశాలు ఇవి' అని నేను చెప్పలేకుండా ఉన్నాను. అలాగని అసలు 'మేష్టారు' మనిషే కాదని మాత్రం ఎలా అంటాను.